ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 13, 2003



హ్యాపీ బర్త్‌డే

(13-4-2003 నుండి 19 -4-2003 వరకు)

జాన్ విల్సన్‌రాజ్
5॥సం, ఏప్రిల్, 1998
రజని-విజయ్‌రాజ్
అడ్డగుట్ట- సికింద్రాబాద్

ఎ.నాగజ్యోతి
7॥సం, 13. 4. 1996
విజయలక్ష్మి-వెంకటేష్
తాళ్ళపల్లి-రంగారెడ్డి

ఎం.మేఘన
ఏప్రిల్,13
సుమాలహరి-హేమసుందర్
వేమూరు-గుంటూరు

టి.రవిచంద్ర
8॥సం,13. 4. 1995
రమాదేవి-శ్రీనివాసరావు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

బి.సతీష్
2సం॥, 14.4.2001
భిక్కి-బద్దు
అక్కారం-మహబూబ్‌నగర్

పి.ఉదయ్ కిరణ్
1॥సం,15. 4. 2002
రాధమ్మ-చంద్రయ్య
బుద్దారం-మహబూబ్‌నగర్

ఇ.సాయి రతన్‌రెడ్డి
1సం॥, 18.4.2002
కవిత-వెంకట్‌రెడ్డి
దిమ్మ(పొచ్చెర)-ఆదిలాబాద్

ఝాన్సీ
2॥సం, ఏప్రిల్, 2001
జ్యోత్స్న-అబ్రహం
మూసాపేట-హైదరాబాద్

వి.స్వీటీ
7॥సం, ఏప్రిల్, 1996
తనూజలక్ష్మి- సూరిబాబు
తాడేపల్లి-గుంటూరు

హారిక
1॥సం,19. 4. 2002
గాయత్రి-రమేష్
ఆమదాలవలస-శ్రీకాకుళం

ఎ.సంతోషి
2॥సం,19. 4. 2001
రజని-మురళి
తిరువూరు- కృష్ణ

వ్యాధి కొంతమంది పిల్లల్లో ఒకటి రెండు పళ్ళకు సోకితే, మరికొంతమందిలో అన్ని పళ్ళకూ సోకుతుంది. ఇలా ఎక్కువ శాతం లేదా మొత్తం పళ్ళకు పిప్పిపన్ను వ్యాధి సోకడాన్ని "రాంపెట్ కేరీస్" అంటారు. ఎక్కువగా సీసాపాలు తాగే పిల్లల్లో ఈ సమస్య ఎదురవుతుంది. పన్నుకు సంబంధించిన పంటి-చిగురు వాయడం, విపరీతమైన నొప్పిని కలిగించడం, ఆ తర్వాత దవడ వాయడం, జ్వరం రావడం, ఆహార పదార్థాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడి పిల్లలు నీరసించి పోవడం, నోటి కదలికలు తగ్గిపోవడం వల్ల లాలాజలం ఊరడం తగ్గి సహజ సిద్ధమైన పరిశుభ్రత లోపించి, నోటి దుర్వాసన వెలువడడం జరుగుతుంది. ఇలాంటప్పుడు పిల్లల బాధ చూడలేని పరిస్థితి, నోటి దుర్వాసనను భరించలేని పరిస్థితి తల్లిదండ్రులకు ఏర్పడుతుంది. అందుచేత ఇలాంటి పరిస్థితి రాకుండా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే.

దవడల్లో రెండు వరుసల పళ్ళు ఉండడం పిల్లల్లో కన్పించే మరో సమస్య. నిజానికి ఇది సమస్య కానే కాదు. కాని మనం దానిని సమస్యగా చిత్రీకరించుకుంటాం. అసలు విషయం ఏమంటే, పిల్లలకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినపుడు రావలసిన కొత్త పళ్ళు (స్థిర దంతాలు) వచ్చేస్తాయి. కాని



కొంతమంది పిల్లల్లో ఆ సమయంలో ఊడవలసిన పళ్ళు ఊడిపోకుండా అలానే ఉంటాయి. దానివల్ల కొత్త, పాతపళ్ళు కలిసి, దవడల్లో రెండు వరసల్లో పళ్ళు (పాలపళ్ళు+స్థిర దంతాలు) కన్పిస్తాయి. ఈ పరిస్థితి గమనించిన వెంటనే అనుభవజ్ఞులైన దంత వైద్యులకు చూపిస్తే వారు క్షుణ్ణంగా పరీక్షించి, ఊడిపోవలసిన పాలపళ్ళను పీకేస్తారు. దానితో అసలైన స్థిరదంతాలు, దవడలు ఒకే వరసలో కన్పిస్తాయి.

తగిన సమయంలో ఊడిపోవలసిన పళ్ళను తీయించక్షపోయినట్లయితే, రెండు వరుసల పళ్ల మధ్య, ఆహార పదార్థాలు చిక్కుకొనిపోయి, పరిశుభ్రతకు నోచుకోక అవి కుళ్ళి బాక్టీరియాల చర్యలకు లోనై నోటి నుండి కొన్ని వాయువులు వెలువడతాయి. అందువల్లనే పిల్లల నోటి నుండి దుర్వాసన అధికంగా వస్తుంది. పిప్పిపన్ను వ్యాధి వల్ల ఏర్పడే పంటి రంధ్రాలలో ఆహార పదార్థాలు ఇరుక్కుపోవడం వల్ల కూడా నోటి దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. అందుచేతనే తరచుగా నోరు పుక్కిలించే అలవాటు పిల్లలకు నేర్పించాలి.

వయస్సును బట్టి పళ్ళు వచ్చే విధానం

(పై దవడ పళ్ళు)

కొరుకుడు పళ్ళు - $7^1/$ నెలల వయస్సు

రెండవ (ప్రక్క) కొరుకుడు పళ్ళు - 9 నెలలు

చీల్చే పన్ను - 18 నెలలు

మొదటి విసురుడు దంతం - 14 నెలలు

రెండవ విసురుడు దంతం - 24 నెలలు

కింది దవడ పళ్ళు

కొరుకుడు పన్ను - 6 నెలల వయస్సు

రెండవ (ప్రక్క) కొరుకుడు పన్ను - 7 నెలలు

చీల్చే పన్ను - 18 నెలలు

మొదటి విసురుడు దంతం - 15 నెలలు

రెండవ విసురుడు దంతం - 20 నెలలు

- ✔ దవడలలో దంతాలు కన్పించినప్పటి నుంచి వాటి పరిశుభ్రత విషయంలో తల్లి దండ్రులు లేదా సంరక్షకులు జాగ్రత్త వహించాలి.
- ✔ స్వయంగా పెద్దలు, పిల్లలకు దంతధావన విధానాలను నేర్పించాలి.
- ✔ ఆహారం గాని, అల్పాహారం గాని తిన్న తరువాత, తీపి పానీయాలు గాని తాగిన మరుక్షణం నోరు మంచినీటితో పుక్కిలించే అలవాటును పిల్లలకు నేర్పించాలి.
- ✔ పిల్లలు తీపి వస్తువులు తినడం నేరం కాదు. కాని తిన్న తరువాత నోరు పుక్కిలించకపోవడం వల్ల దంత సంరక్షణకు లోపం కలుగుతుంది.
- ✔ పిల్లల పళ్ళను తల్లిదండ్రులు గాని, వారి సంరక్షకులు గాని కనీసం వారం రోజులకొకసారి స్వయంగా పరీక్షించాలి.
- ✔ కనీసం ఆరు నెలలకొకసారి దంతవైద్యుల చేత, దంత వైద్య పరీక్షలు చేయించాలి. సమస్య వస్తేనే, వైద్యులను చూపించాలన్న మనస్తత్వం నుండి బయటపడాలి.

పిల్లల కొన్ని అలవాట్ల వల్ల, దంత సంరక్షణలో లోపం, దంతాలలో ఎగుడు దిగుడుతనం వచ్చే అవకాశం ఉంది. పైగా దానివల్ల పిల్లల ముఖం అందవిహీనంగా తయారయ్యే అవకాశం ఉంది. అలవాట్ల వల్ల కూడా పంటి సమస్యలు వస్తాయి. పంటి సమస్యను తెచ్చే ప్రధానమైన అలవాట్లలో, పిల్లలు నోటిలో వేలు వేసుకొని చీకడం తల్లిదండ్రుల ప్రేమకు నోచుకొనకపోవడం, పిల్లల్లో అభద్రతాభావం ఏర్పడడం ఈ అలవాటుకు ప్రధాన కారణం కావచ్చు. అయితే ఈ వేలు చీకడం అనే అలవాటు వల్ల, పై దవడ ముందరి భాగం 'గూడు' మాదిరిగా ఏర్పడడం, పంటికి-పంటికి మధ్య ఖాళీ ఏర్పడడం జరుగుతుంది. ఇది చేజేతులారా పిల్లలు కొని తెచ్చుకొనే సమస్య. ఈ అలవాటుకు మూలకారణాలను వెలికి, పిల్లల్లో ఉన్న ఆ అలవాటును మాన్పించవలసిన బాధ్యత పెద్దలదే.

పిల్లలు ఆట-పాటల్లో మునిగి తేలుతున్నప్పుడు దెబ్బలు తగలడం వల్ల ముందరి పళ్ళు ఊడిరాలిపోవచ్చు. ఇలా ఊడి రాలిపోయిన పన్ను, స్థిరదంతం అయినట్లయితే, తక్షణం ఊడిపోయిన పన్నును దంత వైద్యుల దగ్గరకు చేరిస్తే, దానిని తిరిగి పంటికుహరంలో అమర్చి (రీ-ఇంప్లాంటేషన్) తర్వాత అతి పటిష్టంగా అయ్యేట్లు చూస్తారు. ఇలా అమర్చిన పళ్ళు జీవితాంతం పటిష్టంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ◆

కుచమర్దన స్వాములొస్తున్నారు... జాగ్రత్త

✻ అంపశయ్య నవీన్



చాలా రోజుల తర్వాత మిత్రుడు తిరుపతయ్య మా ఇంటికొచ్చాడు. ఇంట్లోకొస్తూనే "నీకు చూపెడ్దామని ఓ పేపర్ కటింగ్ తీసుకొచ్చాను. దీన్నోసారి చదువు!" అంటూ ఓ ఇంగ్లీషు వార్తా పత్రికలో వచ్చిన ఓ కటింగ్‌ని నా చేతిలో పెట్టాడు. "ఈ వార్త ఈ ఒక్క పేపర్లోనే వచ్చినట్టుంది" అని కూడా మిత్రుడు చెప్పాడు.

ఈయనను ఇంతగా కదిలించిన వార్త ఏమై ఉంటుందా అనుకొని ఆ కటింగ్‌లో ఉన్న న్యూస్ ఐటెమ్‌ని చకచకా చదివేసి "ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయా?" అన్నాను. ఈ న్యూస్ ఐటెమ్‌కు సంబంధించిన ఓ ఫొటోని కూడా ఆ పత్రికవాళ్ళు వేశారు.

ఇంతకూ ఈ వార్తాంశం ఏమిటంటే : వరంగల్‌కు ముప్పైకిలోమీటర్ల దూరంలో ఉండే పరకాల అనే తాలూకా కేంద్రంలో 'కుచమర్దనస్వామి' అనే ఓ స్వామి పిల్లలు లేని ఆడవాళ్ళకు తన అద్భుత శక్తులతో పిల్లల్ని పుట్టిస్తానని తన తాబేదార్లతో ప్రచారం చేయించి చాలా మంది పిల్లలు లేని స్త్రీలను తన ఆశ్రమానికి వచ్చేలా చేశాట్ట. అలా వచ్చిన వాళ్ళ మీద తన సమ్మోహనాస్త్రాన్ని – అంటే హిప్నాటిజాన్ని ప్రయోగించి వాళ్లనొకరకమైన పారవశ్యానికి గురి చేస్తాడట – ఆ తర్వాత వాళ్ళ శరీర భాగాలన్నీ స్పృశించడం ముఖ్యంగా వాళ్ళ స్తనాలను పట్టుకోవడం లాంటి పనుల్ని చేస్తాడట. అందువల్లనే అతడు తన పేరును 'కుచమర్దనస్వామి' అని మార్చుకున్నాడట. ఇతగాని అసలు పేరు 'గొట్టిముక్కల బాబురావు' అట. ఈయన 'కుచమర్దనస్వామి'గా అవతారం ఎత్తకముందు రకరకాలైన వెధవ పనులు చేసి డబ్బులు దండుకోవడానికి ప్రయత్నించి విఫలమై ఇప్పుడీ 'స్వామి' వేషం వేశాడట. చాలా మంది పిల్లలులేని స్త్రీలు ఇతడు చేయించిన ప్రచారాన్ని నమ్మేసి, ఇతని దగ్గరకొచ్చి, ఇతన్ని తమ శరీరాలతో ఆడుకోనిచ్చారట. ఈ మధ్యనే ఒక ఫొటోగ్రాఫర్ ఈ కుచమర్దనస్వామి తను పెట్టుకున్న పేరు ఏపనినైతే సూచిస్తున్నదో ఆ పని చేస్తుండగా ఫొటోలు తీశాడు. ఆ ఫొటోనే ఇప్పుడీ పత్రిక ప్రచురించింది.

పరకాలంటే నాగరికతకు సుదూరంగా ఉన్న ఓ మారుమూల పల్లెటూరు కాదు. వరంగల్‌లాంటి ఓ పెద్దనగరానికి కేవలం ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ చిన్న పట్టణమే ఈ పరకాల. ఇలాంటి పట్టణాల్లో ఇంతహేయమైన, నీచమైన, నికృష్టమైన సంఘటనలు జరుగుతున్నాయంటే మనం ఏమనుకోవాలి ? ఎవడో అడ్డమైన వాడు స్వామి వేషం వేసుకొని నేను మీకు పిల్లల్ని కల్గేలా చేస్తానంటే ప్రజలు నమ్మడమేనా? తమ స్త్రీలను తీసికెళ్ళి వాడికప్పగించటమేనా? వాడు తమ శరీరాల మీద చేసే దౌర్జన్యాన్ని ఈ స్త్రీలు నిశ్శబ్దంగా భరించటమేనా? వాడు ఇంత బహిరంగంగా 'కుచమర్దనస్వామి' అని పేరు పెట్టుకొని తను ఏం చేస్తున్నాడో తన పేరు ద్వారా తెలియజేస్తున్నా ఈ నీచుణ్ణి ప్రజలు నమ్మడమేనా? వాడీ పేరు పెట్టుకున్న మరుక్షణంలోనే ప్రజలు వాడికి బుద్ధి చెప్పొద్దా? ఇంత జరుగుతోంటే పోలీసులేం చేస్తున్నారు?" మాకెవరూ అతన్ని గురించి ఫిర్యాదు చెయ్యలేదు. మమ్మల్నేం చెయ్యమంటారు?"అన్నారట పోలీసులు. ఈ మధ్యనే ఓ వ్యక్తి ఈ లైంగిక స్వామిని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాడట. ఇప్పుడైనా పోలీసులు ఇతని మీద చర్యతీసుకుంటారని ఆశించవచ్చా ?

ఈ దేశాన్ని తరతరాలుగా పట్టిపీడిస్తున్న ఈ దొంగస్వాముల బెడద ఎలా పోతుంది ? ఎంతో చదువుకున్న వాళ్ళ నుండి ఏమీ చదువుకోని వాళ్ళ వరకూ అందరూ అత్యంత సులభంగా ఈ దొంగ స్వాముల్ని నమ్ముతారు. ఆ స్వాముల దగ్గర ఏవో దివ్య శక్తులున్నాయనుకుంటారు. వాళ్ళు ప్రదర్శిస్తున్న ఇంద్రజాల విద్యల్ని ఎందరో మామూలు ఇంద్రజాలికులు కూడా ప్రదర్శించగలరని రుజువైనా ఆ రుజువుల్ని పట్టించుకోకుండా గుడ్డిగా ఈ స్వాముల వార్ల దగ్గర దివ్యశక్తులున్నాయని మహామహా విద్వాంసులు కూడా నమ్మేయడం దిగ్భ్రాంతిని కల్గిస్తుంది. ఇలాంటి దొంగస్వాముల్ని మహామహా విద్వాంసులే నమ్మి వాళ్ళకు దాసోహం చేస్తున్నప్పుడు, పరకాల లాంటి చిన్న టౌన్లో నివసించే అమాయక ప్రజలు ఈ 'కుచమర్దనస్వామి'ని నమ్మడంలో ఆశ్చర్యమేముంది అనిపిస్తుంది.

ఈ మధ్యనే నేనో ప్రముఖ సైంటిస్టును కలుసుకున్నాను. అతడన్న ఓ మాట నన్ను అమితంగా ఆశ్చర్యపరిచింది. 'మానవుడికి మూఢవిశ్వాసాలు (ఆయన సూపర్‌స్టిషన్ అనే మాట వాడాడు) అవసరమే" అన్నాడాయన. "ఎందుకని" నేనడిగితే "వాళ్ళు వాళ్ళ దైనందిన జీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు మూఢ విశ్వాసాలే సమాధానం చెబుతాయి. మూఢవిశ్వాసాలే వాళ్ళను ఓదారుస్తాయి. మూఢ విశ్వాసాలు లేకుండా మామూలు మనుషులు వాళ్ళ జీవిత సమస్యలి ఎదుర్కోలేరు" అన్నాడాయన.

"మూఢ విశ్వాసాలు మనుషులకొక బూటకపు పరిష్కారాన్ని చూపిస్తాయే తప్ప అసలు పరిష్కారాన్ని చూపించవు. అవి మానవున్ని పలాయన వాదం వైపు మళ్ళిస్తాయి. అతన్ని వాస్తవాన్ని తెలుసుకోకుండా, వాస్తవాన్ని ఎదుర్కోకుండా చేస్తాయి. శాస్త్రీయ దృక్పథం అంటే పెద్దమాటవుతుందేమో కనీసం తన అనుభవాన్నైనా గీటురాయిగా పెట్టుకొని మానవులు వాశ్వాసాల్ని ఏర్పరచుకోవాలని చెప్పడం న్యాయం. అంతేగాని మీలాంటి మేధావులు ఇలా మూఢవిశ్వాసాల్ని సమర్థించకూడదు" అన్నాన్నేను.

ఆయన నవ్వి 'సామాన్య మానవునికి మీరు చెప్పింది అర్థం కాదు... స్వాములు చెప్పేదే సులభంగా అర్థమవుతుంది" అన్నాడు.

ఇలాంటి మేధావులున్న ఈ దేశంలో ఇలాంటి కుచమర్దనస్వాములు పుడ్తూనే ఉంటారు. అమాయక స్త్రీలు వాళ్ళ వంచనకు గురవుతూనే ఉంటారు. ఇలాంటి వంచకుల బారి నుండి ప్రజలు తమను తారల రక్షించుకోవాలి. ◆

్కలు కలపండి





అల్లా ఇల్లు

ఓసారి నసీరుద్దీన్ పక్క ఊరు వెళ్లి అప్పడే ఇంటికి చేరాడు. చల్లటి నీళ్లు ఇప్పించుకుని తాగాడు. బాగా అలసటగా వుండడంతో నులకమంచం వేసుకుని నడుం వాల్చాడు. మరుక్షణంలోనే వీధి తలుపును ఎవరో దబదబా బాదిన చప్పుడైంది. నసీరుద్దీన్ బాగా అలసి వుండడంతో లేవలేకపోయాడు. 'ఎవరూ! ఎవరదీ' అని పెద్దగా అడిగాడు. అటువైపు నుంచి సమాధానం రాలా. దాంతో 'ఉష్ .. అబ్బా' అనుకుంటూ వెళ్లి తలుపు తీసి చూశాడు . బయట ఒక ఫకీరు నిలబడి వున్నాడు. తలమీద ఆకుపచ్చ టోపీ, భుజాన ఆకుపచ్చ జోలె వున్నాయి. 'ఎవరు మీరు? నాతో మీకు పనేంటి?' అని అడిగాడు. 'నేను అల్లా అతిథిని. ఈ రాత్రికి మీ ఇంట్లో జాగా కావాలి' అన్నాడు కొత్త వ్యక్తి ఆజ్ఞ జారీ చేస్తున్నట్టుగా. అది నసీరుద్దీన్‌కి నచ్చలేదు. వెంటనే మారు మాట్లాడకుండా తనతో రమ్మన్నట్టు సైగ చేసి ముందుకు నడిచాడు. ఫకీరుకి విషయం అర్థంకాకపోయినా నసీరుద్దీన్‌ను అనుసరించాడు. అలా నడిచి నడిచి చాలా దూరం వెళ్లారు. చివరకు ఒక మసీదు దగ్గర ఆగాడు నసీరుద్దీన్. దాన్ని ఫకీరుకి చూపిస్తూ 'ఇదిగో ఇదే అల్లాగారి ఇల్లు. నీవు అల్లా అతిథివి కదా. ఇక్కడే వుండొచ్చు. అది ఈ ఒక్క రాత్రికే కాదు. ఎన్నాళ్లైనా. అడిగే వాళ్లెవరూ వుండరు. నీవు మా ఇంట్లో వున్నావనుకో ఆ అల్లాకి కూడా కోపం వస్తుంది' అని ఆ అతిథిని వదిలించుకున్నాడు.

స్టెతస్కోప్

...ో...
...వారం చెప్పినట్టు మీకు స్టెతస్కోప్ తయారు ...ాగో చెప్తానే. మరి దాన్ని తయారు చేయడానికి ...ో తెలియాలిగా. 1. చిన్న గాజు గరాటు 2. T ...డే గాజు గొట్టం ...ొట్టాలు. ఇవి ...్కోప్ తయారు ...లా సులభం. ... చిన్న గాజు ...ుకోవాలి. ఆ ...రంలో వుండే ... తీసుకోవాలి. ...చిన్న ముక్కను ...దాదావు 7 ... గరాటు కాడ ...ం వరకూ



...ం రెండవ వైపు నుంచి T గొట్టం ...ి. T గొట్టం రెండు భుజాలకు రెండు పొడవైన రబ్బరు ...ంచాలి.
...స్టెతస్కోప్. పొడవైన రబ్బరు గొట్టాల చివరి భాగాలు ...ని ఎదుటి వ్యక్తి గుండె వున్న ప్రాంతంలో ఛాతీపై ...ంచాలి.
...టు కింద వున్న గుండె చప్పుళ్లు రబ్బరు గొట్టం ద్వారా ...ు.

కలం స్నేహం

పేరు: టి.హిమబిందు,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు :కథలు చదవడం, పాటలు పాడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : టి.హిమబిందు, డాటరాఫ్ టి.వి.రామకృష్ణ, ఇంటినెంబరు: 1-52-27, 7వ వార్డు, సిపాయి పేట, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా.

పేరు: కె.కళ్యాణ్
వయసు :14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు: దీపిక పుస్తకాలు చదవడం, పేపరు చదవడం.
పూర్తి చిరునామా : కె.కళ్యాణ్, సన్నాఫ్ కె.రమణయ్య, మడనూరు.

హాయ్... వేసవి సెలవలు వస్తున్నాయికదా. మీకు 'కలం స్నేహం' చేయాలని వుందా! అయితే ఓ కార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో ఒకటి ఆ కార్డు మీద అంటించి పోస్టు చేయండి.

పదాల పదనిసలు

?	నము
	గము
	లము
	పము
	లజ
	గతి

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

	క	
	వ	
	మ	ర
	బ	
	స	
	గు	

*రుక్మిణి

పెట్రో బాంబ్

సుబ్బారావు ఎగిరి మళ్ళా పడ్డాడు – ఊరికే పడితే ఏ ఊసూ లేదు – ఎందుకంటే సుబ్బారావిట్లా 'ఎగిరి పడడం' ఇది మొదటిసారి కాదు. అట్లా అని ప్రతిసారీ 'ఎగిరిపడడం' అతని తప్పనిసరి నిర్ణయమూ కాదు. ఏ నిర్ణయాలు ఎట్లా వున్నా సుబ్బారావు మొదటిసారి ఎగిరిపడ్డపుడు మోకాలి చిప్పను పచ్చడి పచ్చడి చేసుకుని మరీ దాన్ని వదిలించుకున్నాడు.



ఆ వివరాల్లోకి వెళితే-

సుబ్బారావుకు స్కూటరంటే మహామోజు. చిరకాల కోరిక కూడా! కానీ, ఇంతకాలం నుండీ కొనడానికి సాధ్యపడలేదు. చివరకు తెగించి వాయిదాల పద్ధతి మీద ఓ తెలిసిన మిత్రుడి సాయంతో 'షోరూం'లో కొన్నాడు – దర్జాగా దాని మీద సవారీ అయి రెండ్రోజులు ఊరు ఊరంతా బలాదూర్‌గా తిరిగేశాడు.

"పనీపాటా లేకున్నా గాలి తిరుగుళ్ళు దానిమీదెక్కే తిరగాల్నా... తిరగడం సంబడవే... పెట్రోలు ఖర్చులు నెల చివర్లో లెక్క తేలినపుడు ఉంటుంది. అయ్యగారి ఆర్భాటం..." భార్య కమల కసిగా అన్న మాటలు సుబ్బారావు బుర్రలోకి బలంగా జొరబడ్డాయి. ఆ దినం ఉదయం మార్కెట్ నుండి కూరగాయల సంచీ స్కూటరుకు తగిలించుకుని దర్జాగా... జనం కూడా ఎక్కువగా లేని సమయంలో స్కూటరు మీద వస్తున్న సుబ్బారావు ఇంటి దరిదాపులకు చేరంగానే "కెవ్.. కెవ్వెవ్" అని ఆర్తనాదం లాంటి కేకలు వేస్తూ.. రెండు చేతులూ.. ఆకాశంలో కనపడని దేవుడి కేసి ఎత్తి – ఎగిరి దబ్బున రోడ్డు పక్కన గట్టిగానే పడ్డాడు. మోకాలి చిప్ప పచ్చడి పచ్చడయింది.

అట్లా పడిన సీను ఆసాంతం తీరిగ్గా చూసిన కమలకు అట్లా ఆ మోకాలి చిప్ప పచ్చడి కావడం కన్నా భర్తగారు అట్లా హఠాత్తుగా ఎందుకు ఆర్తనాదాలు చేశాడనే ఆరాతీయడం మొదలు పెట్టింది. తరచీ... తరచీ, మొహంలో మొహం పెట్టీ గద్దించి అడిగేసరికి రావు భయభ్రాంతుడయ్యాడు.

"అట్లా సడెన్‌గా ఆర్తనాదాలు చేసే జబ్బు మీ కుటుంబంలో వుందని పెండ్లికి ముందే చెప్పకుండా నాగొంతు కోసేశారు" అని శోకాలకు తగులుకోడంతో సుబ్బారావు పూరాగా నీరసించి పోయాడు.

"అమ్మతోడు.. అది.. కాదే.. అట్లా వస్తున్నపుడు మనింటి టీవీలో నుండే వార్తలు.. పెట్రోలు లీటరు రెండున్నర రూపాయలు పెంచిన ప్రకటన వినిపించిందే... హబ్బా...!"

అదీ-మొదటి మోకాలి చిప్ప సర్వనాశనం అయిన వైనం! మరి ఈసారి మాత్రం ఠీవిగా... దర్జాగా చౌరస్తాలో చాయ్ తాగి స్కూటరెక్కి వంద గజాల దూరం దాకా వచ్చి ఈల వేస్తున్న వాడల్లా "హుప్.. హుప్" మనే "హుర్రే... హుర్రే" అనీ రెండు చేతులూ వదిలేసి, కాళ్ళతో 'డిస్కో' ఫీటు చేసే సరికి వాహనం కాస్తా ఓ ఇంటి కాంపౌండు వాలును గుద్దుకొనడంతో ఎడమ మోచేయి సెంటరు కీలు తొలిగి అది కాస్తా డీలాపడి కిందకు వేలాడింది!

"స్కూటరు మీద డిస్కో డాన్సులు చేసే విద్య మీకు నేర్పిన ఆ బద్మాష్ గాడు ఎవడండీ... వాడి మాడుపగల... కాళ్ళిరగ...!" అంటూ సుబ్బారావు వెక్కుతూ దిండులో తలదాచుకున్నాడు. "అది కాదే... వస్తుంటే దార్లో ఎవరో పెట్రోలు లీటరు నలభై పైసలు తగ్గిందనేసరికి హుషారు పట్టలేక తదిగిణతోం... తోం...

రెండోసారి ఒకే కేసూ-వ్యక్తీ కాబట్టి ఆ బొమికెల డాక్టరు గారు కూడా సుబ్బారావుతో చాలా సరసంగానే మాట్లాడి బ్యాండేజీలు దట్టంగా బిగదీసేశాడు.

అయితే ముచ్చటగా మూడోసారి మాత్రం బండిమీద నింపాదిగా వస్తూ ఎదురుగ్గా వున్న నిలువెత్తు గోతిలోకి సూటిగా బండి తోలితే.. ముక్కు విరగదీసుకుని ఆస్పత్రికి చేరుకున్నాడు... డాక్టరుగారిక్కూడా ఈ అనుబంధం చాలా తీపిగా జన్మజన్మల బంధంలా చాలా హాయిగా వుంది!

"హేంల్లేదూ... పెట్రోలు రేటు యాబయి పైసలు పెరిగిందని త్తెల్సి... గుండె భేజారెత్తి... త్తి... అర్లా... అర్లా...! సుబ్బారావు బేలగా... నత్తినత్తిగా అసలు విషయం చెప్పేశాడు.. కమలమాత్రం పెట్రోలు ధర పెంచిన మంత్రినీ... మంత్రిగారి బంధువుల్నీ పన్లోపనిగా కళ్ళు మిటకరించి చూసే ప్రధానమంత్రినీ బండబూతులకు తగులుకుని చడామడా కడిగిపారేసింది.

"చూడమ్మా – వాళ్ళను తిట్టి లాభం లేదు... అసలు వాళ్ళేం చేయలేరు – బయట నుండి దిగుమతి చేసే దేశాలు బారెలుకు ఇరవై డాలర్లు పెంచితే ఇక్కడా పెరుగుతుంది. అదీ పాయింటు... తగ్గితే తగ్గుతుంది!"

కమల తలాడించి ఆ మాటలు నమ్మనని మొండికేసింది.

"ఇంకోటి... అసలిదంతా ఆ అమెరికా వాడి పుణ్యమే – వాడికి ప్రపంచం శాంతిగా వుండడం ఇష్టం వుండదు. కారణం లేకుండా ఇరాక్ మీద యుద్ధం ప్రకటిస్తాడు. మొత్తం అరబ్ దేశాల్ని తన గుప్పిట్లో పెట్టుకుని 'చమురు సామ్రాజ్యానికి' ఏకైక ఏలిక కావాలని కలలు కనే అమెరికా పెద్ద దోషి.

సిగ్గులేకుండా ఈ అమెరికా అజెండాకు 'తానతందాన' పలుకుతూ ఆ జెండాకు సాగిలపడే మన విదేశీ విధానం... ఈ ఎగుడు దిగుళ్ళకు కూడా కారణం- పదకొండు సార్లు పెట్రోలు, డీజిలు ధరలు పెంచి, మూడుసార్లు తగ్గించిన మహానుభావులు – ఇంకా భవిష్యత్తులో ఏకంగా 'పెంచటయే' అని కూడా ప్రకటించారు.

సుబ్బారావు ముక్కుతూ మూలుగుతూనే వున్నాడు. ◆

పేస్ వారసుడు ఎవరు?

* సుమేరా ఫిర్దోస్

పేస్, భూపతి

కొద్ది సంవత్సరాల క్రితం జరిగిన డేవిస్ కప్ మ్యాచ్‌లో లియాండర్ పేస్ చేతిలో ఓడిపోయిన అనంతరం "నెట్స్ వద్ద పేస్ రెండు చేతులను కదిపే పద్ధతి అమోఘం" అని అమెరికా టెన్నిస్ స్టార్ ఆండీ క్యాడిక్ కొనియాడాడు. అప్పటినుండి డేవిస్ కప్‌లో భారత్‌కు అతను పెద్దదిక్కుగా మారాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఆసియా ఓషియానా పోటీలో కూడా భారత్ రెండో రౌండ్‌కు క్వాలిఫై అవడంలో అతను కీలకపాత్ర నిర్వహించాడు. ఇతని కారణంగా డేవిస్‌కప్‌లో ఎన్నోసార్లు భారత్ తన స్థాయికంటే మెరుగైన ఆటతీరును ప్రదర్శించింది. గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్లలో గొరాన్ ఇవానిసెవిక్, లైటన్ హెవిట్‌లకు భారత ఆటగాడు గట్టిపోటీ ఇవ్వడాన్ని మీరు ఊహించగలరా? కానీ డేవిస్ కప్‌లో భారత ఆటగాళ్ళు వాళ్లకు కూడా దీటైన జవాబిచ్చారు. ముఖ్యంగా డేవిస్‌కప్‌లో సూపర్ పవర్ జట్లను కూడా భారత్ కంగుతినిపించింది. రామనాథన్ కృష్ణన్, రమేష్ కృష్ణన్, ప్రేమ్‌జిత్ లాల్, అమృతరాజ్ సోదరులు అంతర్జాతీయ టెన్నిస్ రంగంలో భారత్ పతాకాన్ని ఉన్నత దశలో నిలబెట్టారు. ఇప్పుడు ఒక దశాబ్ద కాలం నుండి లియాండర్ పేస్, మహేశ్ భూపతి టెన్నిస్ ప్రపంచంలో భారత్ కలలు సాకారం అయ్యేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. ఈ ఇద్దరు యువ ఆటగాళ్లు తమమధ్య వ్యక్తిగత స్పర్ధలు ఉన్నప్పటికీ దేశ శ్రేయస్సు దృష్ట్యా భారాన్ని తమ భుజస్కంధాలపై మోస్తున్నారు. ఇటీవల జపాన్, న్యూజిలాండ్‌లతో జరిగిన డేవిస్‌కప్ మ్యాచ్‌లలో ముందుండి భారత్‌కు 4-1 తేడాతో విజయం అందించారు. జపాన్, కివీస్‌లపై విజయంతో టెన్నిస్‌లో భారత్ కనీసం ఆసియా స్థాయిలోనైనా సూపర్ పవర్‌గా నిలిచిందనడంలో సందేహం లేదు. పేస్ సింగిల్స్‌లో, పేస్-భూపతి డబుల్స్‌లో రాణించడం వల్లే ఇది సాధ్యమైంది.

పేస్ నిష్క్రమణ తర్వాత పరిస్థితి ఏంటి? జపాన్, న్యూజిలాండ్‌లపై ఒక సింగిల్స్‌లో ఓడిపోయి రెండో సింగిల్స్‌లో విజయం సాధించిన రోహన్ బొపన్నను పేస్ వారసుడిగా పరిగణించవచ్చా? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు బొపన్న మరికొంత కాలం నిరీక్షించాల్సి ఉంటుంది. అయితే ఈ 23 ఏళ్ల బెంగుళూర్ యువ ఆటగాడు నెట్‌వద్ద చూడముచ్చటైన ఆటతీరును ప్రదర్శిస్తాడు. దీంతో ఇతను అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంది. అయితే ఫిట్‌నెస్‌తో సహా కొన్ని రంగాల్లో అతను ఇంకా మెరుగుపర్చుకోవాల్సి ఉంది. రెండో సర్వీస్ చేయాల్సి వచ్చే వరకు అతను ఢీలాపడిపోతాడు.

రోహన్ బొపన్న

హర్ష్ మన్కడ్ పరిస్థితి ఏంటి? మంచిగా ఆడడానికి, విజయం సాధించడానికి మధ్య చాలా తేడా ఉందని ఇతను గత సంవత్సరం ప్రపంచ నెంబర్ వన్ లైటన్ హెవిట్‌తో జరిగిన మ్యాచ్‌లోనే తెలుసుకున్నాడు. ఆస్ట్రేలియాతో గత సంవత్సరం జరిగిన డేవిస్‌కప్ మ్యాచ్‌లో హెవిట్‌కు మన్కడ్ గట్టిపోటీ ఇచ్చాడు. కండరాలకు పనిచెప్పి మెదడును ప్రశాంతంగా ఉంచగలిగిన ఆటగాడే టెన్నిస్‌లో రాణించగలడు. కీలకమైన సమయాల్లో ప్రత్యర్థిని బోల్తా కొట్టించగల కొత్త టెక్నిక్‌ను సంపాదించడంలో మన్కడ్ విఫలమయ్యాడు. ఉదాహరణకు ప్రముఖ స్ట్రోక్ ప్లేయర్ పీట్ సంప్రాస్ బలమైన సర్వీస్‌లతో, ఆండ్రీ అగస్సీ సర్వీసులకు దీటైన జవాబివ్వడంతో, స్టెఫీగ్రాఫ్ ఫోర్‌హ్యాండ్ షాట్లతో, స్టిఫాన్ ఎడ్బర్గ్ చూడముచ్చటైన వాలీలతో కష్టాల నుండి విజయవంతంగా బయటపడగలుగుతారు. మన్కడ్ దీన్ని మెరుగుపర్చుకోవాలి.

ఒక్కముక్కలో చెప్పాలంటే దశాబ్దంపైగా భారత్‌కు సేవలందించిన పేస్, భూపతిలకు దీటైన వారసులు ప్రస్తుతం దేశంలో లేరు. ఇప్పటికీ భారత టెన్నిస్‌కు పెద్దదిక్కు పేస్. ప్రతీ ఆటగాడి వయస్సు మళ్లిన తర్వాత అతని ఆటతీరులో మార్పురావడంలో సందేహం లేదు. అటువంటప్పుడు మరో ఆటగాడికి అవకాశమిస్తూ పేస్ మెల్లగా తెరవెనక్కు వెళ్లాల్సిన సమయం వస్తుంది. దానికోసం సత్తాకలిగిన వారిలో కనీసం ఒక ఆటగాడిని సిద్ధంగా ఉంచుకోవాలి. దానికి బొపన్న, హర్ష్ మన్కడ్‌లతో పాటు జీషన్ అలి, గౌరవ్ నటేకర్, సందీప్, నితిన్ కీర్తనే, సునీల్ కుమార్ సిపయా, విశాల్ ఉప్పల్‌లలో ఒక్కరిని పేస్‌కు వారసుడిగా తయారుచేసుకోవాల్సిన కర్తవ్యం అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్ (ఎఐటిఎ)పై ఉంది. కానీ దురదృష్టవశాత్తూ ఎవరికీ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంపై టెన్నిస్ అసోసియేషన్ దృష్టి నిలపడం లేదు. ఈ విషయంలో అమెరికా, ఆస్ట్రేలియాలలో అనుసరిస్తున్న పద్ధతులను ఆదర్శంగా తీసుకోవాలి. ఆ దేశాల్లో ప్రయివేటు సంస్థలతో క్రీడా సంఘాలు ఒప్పందం కుదుర్చుకొని, కొంతమంది క్రీడాకారుల ఆటకు పదును పెట్టడం ద్వారా వారిని ఉత్తమ ఆటగాళ్లుగా తీర్చిదిద్దుతారు. ఈ దిశగా భారత టెన్నిస్ అసోసియేషన్ సరైన కృషి చేయడం లేదు. ఈ యువ ఆటగాళ్లకు యూరప్, అమెరికాల్లోని పలు అకాడమీలలో శిక్షణ ఇప్పిస్తూ ప్రపంచంలోని అన్ని మైదానాలపై, ఉత్తమ ఆటగాళ్లతో మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించాలి. అప్పుడే వారి ఆటకు పదును పెరుగుతుంది. అప్పుడే లియాండర్ పేస్‌కు, మహేశ్ భూపతికి సరైన వారసుని తయారు చేసుకోగలుగుతాము. ◆



హర్ష్ మన్కడ్

'క్షమించవూ!...'

* అత్తలూరి విజయలక్ష్మి

సరోజకి టెన్షన్‌గా ఉంది...

శరీరం యావత్తూ ఎందుకో తెలియకుండా వణికిపోతోంది... చేతిలో ఏం పట్టుకున్నా చేయి తొణికి జారిపోతోంది... మనసులో ఆందోళన... గుండెల్లో చిత్రమైన పులకింతలు... నిద్రపట్టడం లేదు..

సరిగ్గా వారం రోజుల్లో తన జీవితంలో కలగబోయే ముఖ్యమైన ఘట్టం తాలూకు స్మృతులు నిలువెల్లా పాకి ఆనందపు తరంగాలు వెల్లివిరుస్తున్నాయి...

వారం రోజుల్లో సరోజ పెళ్ళి...

రెండు నెలల క్రితం ప్రసాదరావు ఆఫీసులో అతనితో పాటే పని చేస్తున్న ఆనందరావు కొడుకు శ్రీకాంత్ పెళ్ళి చూపులకొచ్చాడు... అతడిని చూడగానే మనసు పారేసుకుంది సరోజ... తెల్లగా, పొడుగ్గా, బలిష్టంగా, నల్లటి ఒత్తయిన క్రాఫ్ నిర్లక్ష్యంగా దువ్వి, అందంగా ఉన్నాడు శ్రీకాంత్.... అతని కోసం సరైన ఈడూ, జోడూ ఉన్న అమ్మాయి కావాలని, నాలుగైదు సంబంధాలు చూసి, ఓ స్నేహితుడి ద్వారా సరోజ అందచందాలు గురించి విని, స్నేహితుడితో మాట కలిపాడు ఆనందరావు..

"నాకు కట్నం అక్కర్లేదోయ్ అందమైన అమ్మాయి, గుణవంతురాలు, అంతో, ఇంతో చదువూ ఉంటే చాలు.. ఆమె ఉద్యోగం కూడా చేయక్కర్లేదు... మాకు ఆస్తిపాస్తులకేం కొదవలేదు... పైగా మావాడు సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు... నెలకి నలభైవేలు వస్తాయి" అని చెప్పుకొచ్చిన ఆనందరావుతో, "నాకింతకన్నా ఏం కావాలి ఆనంద్. నేనే నిన్ను అడగాలనుకున్నాను... కానీ, నువ్వేం అంటావో అని సందేహించాను.. మా అమ్మాయి కూడా ఎమ్మెస్సీ చేసింది... వెంటనే మీ అబ్బాయిని తీసుకుని పెళ్ళి చూపులకురా" అంటూ ఆహ్వానించాడు ప్రసాద్‌రావు.

అలా మాటలు కలపడమే ఆలస్యంగా సంబంధం కూడా కలిపి, నిశ్చయతాంబూలాలు పుచ్చుకున్నారు. పెళ్ళి ముహూర్తం కూడా నిశ్చయం అయింది... పైకి చదవాలనుకున్న సరోజ అనుకోకుండా వచ్చిన సంబంధం, పైగా పెళ్లికొడుకు రూపం, ఉద్యోగం, చూసి మనసు పారేసుకుంది... ఎప్పుడెప్పుడు పెళ్ళి చేసుకుని అతని సన్నిధికి వెళ్తానా అని ఎదురు చూస్తోంది.. అనుకున్న సమయం వచ్చింది... ఇంక వారం రోజుల్లో పెళ్ళి. ఆ తరువాత శ్రీకాంత్‌తో తను బెంగుళూరు వెళ్తుంది... అతనికి అక్కడ ఉద్యోగం... అమ్మా, నాన్నల్ని, చెల్లాయి నీరజనీ, అన్నా, వదినల్ని వదిలి బెంగుళూరు వెళ్ళాలంటే మనసులో దిగులుగా వున్నా, శ్రీకాంత్‌తో గడపబోయే మధురమైన వైవాహిక జీవితం తల్చుకుంటుంటే ఆ దిగులు మటుమాయం అవుతోంది.

పెళ్లి చూపుల నాటి శ్రీకాంత్ మొహం గుర్తొచ్చింది... ఎంతో మొహమాటంగా, కళ్ళెత్తి అమ్మాయిని చూస్తే ఏమనుకుంటారో అన్నట్టు బిడియంగా కూర్చున్నాడు... "ఏవన్నా మాట్లాడు అమ్మాయితో" అన్న వాళ్ళమ్మతో "ఏం ఉందిలేమ్మా మాట్లాడడానికి" అన్నాడు మెల్లగా.. అయినా పెద్ద వాళ్ళు ఊరుకోకుండా తామిద్దరినీ కాస్సేపు ఏకాంతంగా వదిలి వెళ్ళారు... "ఏవన్నా మాట్లాడుకోండి... కలిసి నూరేళ్ళూ బతకాల్సిన వాళ్ళు" అంటూ... అప్పుడు కూడా ఏం చేస్తున్నారు? మీ సబ్జెక్ట్ ఏంటి? ఉద్యోగం చేయాలని ఇంట్రస్ట్ ఉందా? మీకు ఫైనాన్షియల్ ఫ్రీడం ఉంటే బాగుంటుంది కదా... మీ అభిరుచులేంటి" అంటూ పొడిగా కొన్ని ప్రశ్నలేశాడేగానీ సరదాగా ఏమీ మాట్లాడలేదు... ఆ తరువాత రెండుసార్లు సెలవు రోజుల్లో వచ్చాక కూడా కలిశాడు... ఇద్దరూ కలిసి రెస్టారెంటుకి వెళ్ళారు కానీ, పెళ్ళి గురించి, గడపబోయే జీవితం గురించి ఏం మాట్లాడుకోలేదు... ఆడపిల్లలా ఇతనికి ఇంత సిగ్గేంటి అనుకుంది సరోజ.... కాకపోతే అతను తనతో ఏదో చెప్పాలని చెప్పలేక మొహమాటపడుతున్నట్లు గ్రహించింది కానీ, అదేంటి అని ఆమె అడగలేదు... అతను చెప్పలేదు...

ఈలోగా పెళ్ళి ముహూర్తం దగ్గరపడింది...

పెళ్ళికాగానే అతను ఏం చెప్పాలనుకున్నాడో అడగాలి.. అనుకుంది సరోజ...

సరోజ ఎదురు చూసిన రోజు వచ్చింది.

ఆ రోజే పెళ్ళి... అటు స్నేహితురాళ్ళు, ఇటు చెల్లెలు, అన్నా, వదిన అంతా కలిసి ఆట పట్టిస్తున్నారు... అందరూ కూడా రతీమన్మధుల తరువాత అంతటి అందమైన జంట మీదేనే అంటోంటే సరోజకి గర్వంతో ఒళ్ళంతా పులకించసాగింది.

పెళ్ళివారు తరలివచ్చారు... రంగ, రంగ వైభవంగా పెళ్ళి జరిగింది.

అప్పగింతలప్పుడు నీరజ, సరోజని కౌగలించుకుని బావురుమంది.. వదిన పద్మ కన్నీళ్ళు అణచుకుంటూ దీవించింది. అన్నగారు దగ్గరకు తీసుకుని వీడ్కోలిచ్చాడు.. తండ్రి దీవిస్తూ, 'నాకన్నా బాగా చూసుకునే మావగారున్నారు తల్లీ నీకు... దిగులెందుకు" అన్నాడు..

తల్లి, సరోజకి జాగ్రత్తలు చెప్పింది..."నువ్విప్పుడు కొత్త జీవితంలోకి, కొత్త మనుషుల మధ్యకు వెళ్తున్నావు... ఇకనుంచీ నీ జీవితాంతం అక్కడే బతకాలి.. నెమ్మదిగా ఆ పద్ధతులకు అలవాటు పడు.. నీకు నచ్చని పద్ధతులుంటే నెమ్మదిగా చెప్పి మార్చుకో.. వీలైనంత మటుకు సర్దుకుపోవడానికి ప్రయత్నించు..."

ఆనందరావు, ఆయన భార్య సరస్వతి ఇక నుంచీ 'మీ అమ్మాయి మా అమ్మాయి.. మీరేం దిగులు పెట్టుకోకండి" అంటూ అభయం ఇచ్చారు.

అందరూ కలిసి, పూలతో అలంకరించిన కారులో బయలుదేరారు... ముందుగా బంజారాహిల్స్‌లో ఉన్న ఆనందరావు ఇంటికి వెళ్ళారు...రెండు రోజులు అత్తగారింట్లో పూవులా చూసుకున్నారు సరోజని.. శ్రీకాంత్ ఇంకా మొహమాటంగానే మాట్లాడుతున్నాడు.. వాళ్ళ మొదటిరాత్రి అందరిలా ముహూర్తాలు, సంప్రదాయాలు అంటూ కాకుండా హనీమూన్‌లో చేసుకోవాలని వాళ్ళకి ఊటీకి టికెట్లు బుక్ చేయించాడు ఆనందరావు.. ఆ రోజే సరోజ, శ్రీకాంత్ ఊటి బయలుదేరారు...

సరస్వతి సరోజతో అన్నది... "పెద్దవాళ్ళం ఎవరం దగ్గర లేకుండా, చాదస్తాలు పెట్టుకోకుండా మీ మొదటి రాత్రి గడుపుకుంటున్నారు.. నీకంతా తెలుసనుకో... కానీ, మీ అమ్మలా చెప్పడం నా ధర్మం... అందుకే చెబుతున్నాను... బెదిరిపోకుండా హాయిగా గడుపు..." సరోజ చెంపలు సిగ్గుతో కెంపులయ్యాయి.. బరువుగా వాలిపోతున్న సోగకళ్ళతో అత్తగారివైపు చూసీ చూడకుండా చూసి తలూపింది.

తల్లీ, తండ్రి, అన్నగారు, చెల్లెలు, అత్తగారు, మావగారు ఎయిర్‌పోర్టులో వీడ్కోలివ్వగా శ్రీకాంత్‌తో కలిసి ఊటీకి వెళ్ళింది సరోజ... ఖరీదైన రిసార్ట్ బుక్ చేసి ఉంచాడు ఆనందరావు... ఆ రిసార్ట్‌లోకి అడుగు పెడుతూనే తన అదృష్టానికి మురిసిపోయింది. అప్పటిదాకా శ్రీకాంత్‌తో ఏకాంతం కోసం ఎదురు చూసిన సరోజకి ఇప్పుడు ఏకాంతం లభించింది. ఎప్పుడెప్పుడు అతని విశాలమైన వక్షస్థలం మీద వాలిపోదామా, ఆ బలిష్టమైన చేతుల్లో నలిగిపోదామా అని ఎదురు చూడసాగింది. ఆ ఏకాంతంలో తనని ఎంతో ఆవేశంగా, ఉద్రేకంగా దగ్గరకి తీసుకుంటాడని, ముద్దుల్తో ముంచెత్తుతాడని ఊహించిన సరోజకి అతని బిడియంతో కూడిన ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. మగవాళ్ళింత బిడియంగా ఉంటారా అనుకుంది... అతనలా ఉంటే తను చొరవచూపించడానికి సిగ్గుపడింది.. సాయంత్రం దాకా ఊటీ అంతా తిరిగి ఆ సౌందర్యాన్ని ఆస్వాదించారు. హోటల్లో ఖరీదైన భోజనం చేశారు. అతనేదో ఆలోచనల్లో పరధ్యానంగా ఉండడం గమనించింది. ఆమెకెందుకో మొదటిసారిగా అతని ప్రవర్తన పట్ల అనుమానం కలిగింది... ఇతనికి తనతో పెళ్ళి ఇష్టం లేదా అనుకుంది.. అలాగైతే ఎందుకు చేసుకుంటాడు? చిన్నపిల్లవాడు కాదుగా పెద్దవాళ్ళు మెడలొంచి ఇష్టం లేని పెళ్ళి చేయడానికి... బహుశా ఇతని స్వభావమే ఇంతేమో.. రాత్రి తప్పకుండా తనకి స్వర్గసుఖాలు చూపిస్తాడు అనుకుని ఆశించింది...

అయితే ఆ రాత్రి మంచం మీద చేరిన సరోజ తనపక్కన కొంచెం ఎడంగా కూర్చుని

"అలసిపోయావా పడుకుంటావా?"అని అడిగిన శ్రీకాంత్‌ని చూసి నివ్వెరపోయింది.

అప్పుడప్పుడు కథలో చదివిన కొన్ని సంగతులు గుర్తుకు వచ్చి ఇతని మొహమాటం తనే పోగొట్టాలని నిశ్చయించుకుని కొంటెగా అన్నది "అప్పుడేనా.."

శ్రీకాంత్ ఆ చిలిపిదనం ఆస్వాదించలేకపోయాడు... నెమ్మదిగా మంచం మీంచి లేచి కిటికీ దగ్గరగా నడిచి, బైటకి చూస్తూ నిలబడ్డాడు.. సరోజ తాను కూడా లేచి అతని దగ్గరగా నడిచి ఆప్యాయంగా అతని భుజం మీద చేయి వేసింది.

అతను చివ్వున వెనక్కి తిరిగి దూరం జరిగాడు... సరోజ మనసు గాయపడింది.. ఎర్రబడిన కళ్ళతో అతని వైపు నివ్వెరపోయి చూసింది.. అతను అక్కడి నుంచి తిరిగి మంచం దగ్గరకు నడిచాడు...

సరోజ నిలుచున్న చోటే స్థంభించిపోయి కొన్ని క్షణాలు ఉండిపోయింది.. ఆమె మెదడు, నరాలు చిట్లిపోతాయా అన్నంత టెన్షన్ భరిస్తోంది.... గుండెల్లో డైనమైట్లు పేలుతున్న భావన...ఏం జరిగింది? ఇతను ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు... తనంటే ఇష్టం లేదా? ఏం నాకేం తక్కువైంది? అందం లేదా? చదువు లేదా, సంస్కారం లేదా, ఎందుకీ విముఖత... కొత్తగా పెళ్ళి అయిన వాళ్ళు ఏకాంతం కోసం తపిస్తారు... దొరికిన ఏకాంతాన్ని పూర్తిగా అనుభవిస్తారు.. ఆనందిస్తారు... మిగతా ప్రపంచాన్ని మర్చిపోయి తామిద్దరే లోకమన్నట్లు గడుపుతారు.. అలాంటిది ఇతను.. ఇతను... ఇతనిలో భావాల్లేవా? స్పందన లేదా? ఇతను.. కొంపతీసి... సరోజ తల విదిల్చింది... నో!

భగవంతుడా... నా జీవితం ఏం చేయబోతున్నావు.. నేను కన్న కలలన్నీ భగ్గున మండి బూడిదకాబోతున్నాయా? ఈ వివాహంతో నా మెడకు ఉరి బిగించావా? అయ్యో నా భవిష్యత్తేంటి?

"సరోజా!" శ్రీకాంత్ పిలుపుతో ఉలిక్కిపడి చూసింది... సరూ! అనో 'రోజా' అనో ప్రేమగా పిలుస్తాడనుకుంది... కానీ, ఎంతో ముక్తసరిగా, పరాయివాళ్ళను పిలిచినట్టు సరోజా అంటున్నాడు....

అతను మళ్ళీ పిలిచాడు.. 'సరోజా... నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి... పెళ్ళికి ముందే చెప్పాలనుకున్నాను.. కానీ, చెప్పలేకపోయాను... ఇప్పుడన్నా చెప్పకపోతే నీకు ఎంతో అన్యాయం చేసిన వాడిని అవుతాను..."

సరోజ గుండె దడదడ లాడింది.. ఏం చెప్పబోతున్నాడు.. ఊపిరి బిగపట్టి చూసింది.

"సరోజా... నేను... నేను ఓ అమ్మాయిని ప్రేమించాను... మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం.. కానీ, నాన్నగారు మా పెళ్ళికి అంగీకరించలేదు... బలవంతంగా నీతో పెళ్ళికి ఒప్పించారు..."

"స్టాప్... స్టాప్ నాన్సెన్స్.." గట్టిగా అరిచింది సరోజ..

అతను స్థాణువై చూశాడు.. అతడి కళ్ళల్లో బెదురు స్పష్టంగా కనిపించింది...

"సిగ్గులేదూ.... మీ నాన్నగారు బలవంతంగా పెళ్ళి చేయడానికి మీరు చిన్నపిల్లాడా... ఈ మాట నాతో ముందు ఎందుకు చెప్పలేదు? నా జీవితం ఎందుకు.. ఎందుకు నాశనం చేశారు? నేనేం అపకారం చేశాను మీకు...." దుఃఖంతో వణికిపోతూ ఆవేశంగా అడిగింది..

శ్రీకాంత్ బాధగా చూశాడు... "అయాం సారీ.. నీ జీవితం నాశనం చేయాలన్న ఉద్దేశం నాకెంతమాత్రం లేదు.. అందుకే... అందుకే మన శోభనానికి ముందే చెప్తున్నాను..."

"అంటే పెళ్ళంటే మీ అభిప్రాయం ఏంటి? శోభనానికి ముందు చెప్పడం అంటే పెళ్ళి అయినా ఫర్వాలేదు.. కాపురం చేయకూడదని నిశ్చయించుకున్నారా? నేనెలా కన్పిస్తున్నాను.. నాకు కోరికలు, ఆశలూ, ఆశయాలు ఉండవనుకుంటున్నారా? నేను మనిషిని కాననుకున్నారా? చెప్పండి..."

"అదేం లేదు సరోజా... దయుంచి నీ ఆవేశం తగ్గించుకుని నా మాట విను... నీకు నేను నేనే వేరే సంబంధం చూసి పెళ్ళి...."

సరోజ గట్టిగా అన్నది... "ఓ ఆదర్శ పురుషుడిలా నాకు విడాకులిచ్చి కన్య అంటూ మరో వ్యక్తికిచ్చి పెళ్ళి చేస్తారా? నేను తాళి కట్టానే కానీ, ఆమెని ముట్టుకోలేదు... అని అవతలి వ్యక్తికి మీరే నచ్చచెప్తారా? ఇదే ఇంకో అమ్మాయి ఎవరన్నా వచ్చి మీతో చెబితే మీరు

నమ్ముతారా? హు.. మీ మగవాళ్ళ బుద్ధి తెలిసి కూడా ఇలా మాట్లాడడానికి మీకు నోరెలా వస్తోంది.. మీలాగా నేను మీరంటే ఇష్టం లేకపోయినా పెద్దవాళ్ల బలవంతంతో ఈ పెళ్ళికి ఒప్పుకోలేదండీ.. మిమ్మల్ని చూసిన మొదటిక్షణం నుంచీ మిమ్మల్ని గాఢంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను.. మీ కోసం కలవరించి, పలవరించి తపించి చేసుకున్నాను.. ఈ క్షణం కోసం, మీతో గడపబోయే జీవితాన్ని రంగుల్లో ఊహించుకుని బంగారు మేడలు కట్టుకున్నాను.. ఆ మేడల్లో మీతో కలిసి అన్యోన్యమైన, ఆదర్శవంతమైన దాంపత్య జీవితాన్ని ఊహించుకున్నాను.." సరోజ హఠాత్తుగా మాటలాపేసి వెక్కి వెక్కి ఏడవసాగింది.

శ్రీకాంత్ నిశ్చేష్టుడై ఆమె నెలా ఓదార్చాలో తెలియక అలా నిలబడిపోయాడు...

ఊటీలో గడపాల్సిన మిగతా రెండు రోజులూ ఇద్దరిమధ్యా భయంకరమైన నిశ్శబ్దంతో గడిచిపోయింది.... తిరిగి హైదరాబాద్ వచ్చారు.. ఊటీనుంచి నేరుగా బెంగుళూరు వెళ్ళాలి కానీ, శ్రీకాంత్ కారణం చెప్పకుండా వారం రోజులు సెలవు పొడిగించాడు.. హైదరాబాద్ వచ్చాక సరోజ జరిగిన సంగతేదీ ఎవరికీ తెలియకుండా నవ్వుతూ తిరిగింది.. ఆ వారం రోజుల్లో ఇద్దరూ కలిసి రెండు రోజులు తల్లిగారింట్లో ఉన్నారు...

ఆ రోజే బెంగుళూరు ప్రయాణం... సరోజ అప్పగింతల నాడు అంతగా కన్నీళ్ళు పెట్టలేదు.. ఆ రోజు ఆమె మదిలో తాను శ్రీకాంత్‌లో గడపబోయే జీవితాన్ని గుర్చిన ఎన్నో కలలున్నాయి.. కానీ, ఈనాడు ఆ కలలన్నీ కల్లలవడంతో గుండె పగిలేలా ఏడ్చింది. అదంతా దూరంగా వెళ్తున్నందుకు దిగులనుకున్నారు తల్లి, తండ్రి, అత్తా మామలు...

బెంగుళూరు చేరాక సరోజ శ్రీకాంత్‌తో ఎంతో ప్రేమగా ఉండసాగింది.. వారిద్దరి పడకగదులు వేరే... శ్రీకాంత్ భార్యగా ఉదయం లేచిన దగ్గర్నించీ ఎన్నో సేవలు చేయసాగింది... కమ్మటి వంట చేసి పెట్టడం, ఇల్లంతా అందంగా, ఆకర్షణీయంగా సర్దడం అతనికి ఏ వేళకి ఏం కావాలో అన్నీ అమర్చడం.. ఆమె దినచర్యలో భాగం అయ్యాయి. మనసులో ఎంతో దిగులూ, చింతా వున్నా, చిరునవ్వుతో కనిపిస్తోన్న సరోజ ఉద్దేశం ఏంటో అతనికి అర్థం కాలేదు..

కానీ, ఆమె ఇంట్లో ఉంటే అతనికి ఎందుకో హాయిగా అనిపించసాగింది... రోజూ ఆఫీసు అయిపోగానే అతను తన ప్రియురాలు చరితను కలుసుకుంటూ పొద్దుపోయిందాకా ఆమెతో గడిపి ఇంటికి వస్తాడు.. చరిత అతని క్లాస్‌మేట్.. ఇప్పుడు కొలీగ్ కూడా.. ఆమె క్రిస్టియన్...కులంగానీ, మతంగానీ తమది కావని, తమతో అంతస్తుకి సరితూగదని ఆనందరావు ఆమెని చేసుకోవడానికి ఒప్పుకోలేదు. అలాకాదని కొడుకు ఆ అమ్మాయినే చేసుకుంటే తాను ఉరివేసుకుంటానని బెదిరించాడు. దాంతో శ్రీకాంత్ బెదిరిపోయి, బలవంతంగా తండ్రి కుదిర్చిన సరోజను చేసుకున్నాడు.. కానీ, చరితతో అనుబంధం మర్చిపోలేకపోతున్నాడు.. అతని పెళ్ళి సంగతి తెలిసిన చరిత "నా భవిష్యత్తేంటి"? అని నిలదీసింది... సరోజతో తాను చెప్పిన సంగతి చెప్పి, "త్వరలో సరోజకి విడాకులిచ్చి నిన్ను చేసుకుంటాను" అని మాటిచ్చాడు...

అయితే సరోజ ఎంతకాలం గడిచినా విడాకుల మాట ఎత్తలేదు.. ఒకటి, రెండుసార్లు అతనా విషయం ఎత్తబోయి, సరోజ మాటమార్చడంతో భయం వేసి తరువాత అడగచ్చు లెమ్మని వాయిదావేశాడు... ఆరు నెలలు గడిచాయి.

ఓ శుభముహూర్తాన ఆనందరావు, సరస్వతి వచ్చారు... వాళ్ళ కొత్తకాపురం ఎలా ఉందో చూడాలని.. వాళ్ళు వచ్చిన దగ్గర్నించీ సరోజ ప్రవర్తనలో చిత్రమైన మార్పొచ్చింది.

సరోజ బెడ్‌రూం వాళ్ళకిచ్చి, తాను శ్రీకాంత్ రూంలోకి షిఫ్ట్ అయింది... ఒకే గదిలో ఉన్నా, ప్రేమించిన భర్తకి శారీరకంగా దూరంగా ఉండడంతో ఆమెకి పిచ్చెక్కినట్టు అయింది...

దానికితోడు సరోజతో మాట్లాడే అవకాశం దొరకడంతో శ్రీకాంత్ ఆమెని విడాకుల గురించి ఆలోచించమని ఒత్తిడి చేయసాగాడు.. కొడుకూ, కోడలూ ఆనందంగా ఉన్నారని, కోడలు ఉత్తమురాలని ఊహించిన ఆనందరావు దంపతులు సరోజ ప్రవర్తనకి తెల్లబోయారు.. అత్తమామలతో, భర్తతో సరోజ నిర్లక్ష్యంగా వ్యవహరించసాగింది.. ఉదయం ఐదింటికి లేచి పూజా పునస్కారాలు చేసి, కమ్మగా వండిపెట్టే సరోజ ఎనిమిదింటికి లేచి, నింపాదిగా బ్రష్ చేసుకుని, పూచికపుల్ల కూడా ముట్టుకోకుండా ఇంటిపని, వంటపని అత్తగారిమీద వదిలేయడం చిత్రంగా అనిపించసాగింది శ్రీకాంత్‌కి... దానికితోడు అతనితో అనవసరంగా వాదనేసుకోడం, దెబ్బలాడడం, అకారణంగా ఏడుస్తూ కూర్చోడం.. ఇతంతా చూసిన సరస్వతి భర్తతో అన్నది. 'ఏమిటండీ ఇది? ఎంతో మంచిపిల్ల అనుకుంటే ఈ అమ్మాయి ఇలా

(తరువాయి 23వ పేజీలో)

హేతువాద ప్రతిబింబాలు



బింబాలు-ప్రతిబింబాలు
రచన : రావెల సాంబశివరావు;
వెల : రు.70/-,
ప్రతులకు : సృజనా పబ్లికేషన్,
ఇ.నెం.3-30-12, నలందా
నగర్, రింగ్‌రోడ్, గుంటూరు

రావెల సాంబశివరావుగారు ఆకాశవాణిలో, పుస్తకావిష్కరణ - అభినందన సభల్లో ఉపన్యసించిన ప్రసంగ వ్యాసాలను 'బింబాలు-ప్రతిబింబాలు'గా వెలువరించారు.

ప్రశ్న ప్రగతికి మూలం కాబట్టి ప్రశ్నించడం నేర్చుకొమ్మనే శాస్త్రీయ దృక్పథం వారిది. కవిరాజు మీద వచ్చిన వ్యాసాలను బట్టి చూస్తే, వ్యాసకర్తకున్న హేతువాద దృక్పథాన్ని పాఠకులు ఇట్టే పసిగట్టవచ్చు. వేదయుగం నుండి కవిరాజు వరకు విస్తరిల్లిన హేతువాద దృక్పథాన్ని విశ్లేషించిన వ్యాసం ఒకటి కాగా, కవిరాజుగారి 'భగవద్గీత'ను పరామర్శించిన వ్యాసం మరొకటి. పురాణ పురుషుడైన శ్రీకృష్ణుని అవతారం సూతపురాణంలో ఎలావుందో మరొక వ్యాసంలో తెలియజేశారు. 'సూతపురాణం' చదవని వాళ్ళకు ఆ పుస్తక సారాంశాన్ని ఈ వ్యాసం తెలియజేస్తుంది. కొడవటిగంటి వ్యాసాల ఆధారంగా అతని చారిత్రక అవగాహన, అతనాశించే సాంస్కృతిక విప్లవం గురించి రెండు వ్యాసాలలో తెలియజేసిన తీరు బాగుంది. "కవుల కల్పనలో వేణువు" ఒక డిఫరెంట్ వ్యాసం. ఇందులో భాగవతం, అన్నమయ్య తర్వాత ఆధునిక కవులలో వేణువు ప్రసక్తి తెచ్చిన సందర్భాలను పేర్కొన్నారు. కవులు, గాయకులు, కథలు-నవలలు ప్రసక్తి తెచ్చి ఈ వ్యాసాన్ని జనరలైజ్ చేసినా, ఇది మరింత సమగ్రంగా ఉంటే బాగుండేది. నాగసూరి 'సైన్స్‌వాచ్' 'సైన్స్ వైతాళికులు' పుస్తకాల అవిష్కరణ సభలో చేసిన ప్రసంగాలలో 'సైన్స్‌కు హ్యూమన్ టచ్' ఇవ్వాలనే సందేశాన్ని తెలియజేయడంతో పాటు నాగసూరి గొప్పతనాన్ని ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుంది. నిజానిజాలను నిగ్గుతేల్చే ప్రయత్నమే 'త్రిపురనేని నాటకాలు' అనీ, పల్లె జీవితాన్ని విశ్లేషించిన నాటికలు నార్లవారి 'కొత్తగడ్డ' అనీ, మానవ ఉన్నతీకరణకు 'ఆదర్శ శిఖరాలు', జి.వి.కృష్ణారావు నాటికలు అని తెలియ జేశారు. వ్యాసకర్తకు స్వీయ చరిత్రలపై ఉన్న ఆసక్తిలో భాగంగా కందుకూరి స్వీయచరిత్ర, నా చిన్ననాటి ముచ్చట్లు, జాషువా నా కథలపై పరిచయ వ్యాసాలున్నాయి. అలభ్య గ్రంథంగా ముద్రపడిన కె.ఎన్.కేసరిగారి "నా చిన్ననాటి ముచ్చట్లు" ఈ తరం వారికి తెలియని ఎన్నో విశేషాలు తెలియజేస్తాయి. రావూరి భరద్వాజ, సంజీవదేవ్ పరిచయాలలో ఎంతో ఆత్మీయత ఉట్టిపడుతుంది. చారిత్రక శకలాలుగా మిగిలిన 'అమరావతి శిధిలాలు'పై వ్యాసకర్త ఆవేదనను అర్థం చేసుకోవచ్చు. తెలుగు జర్నలిజానికి 'నార్ల సంపాదకత్వం' దిక్సూచి అంటూనే, కె.వి.ఆర్., పొత్తూరి లాంటి ప్రముఖుల సంపాదకీయాల సారాంశాన్ని-గొప్పదనాన్ని కూడా తెలియజేశారు. యూనివర్సిటి రిజిస్ట్రార్‌గా 'విశ్వవిద్యాలయ పరిపాలన' ఎంత కష్టతరమో చూపుతూ, విద్యారంగాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను తెలియజేస్తూ, నాగార్జున విశ్వవిద్యాలయ చరిత్ర-వికాసాన్ని ఆసక్తిగా తెలియజేశారు.

ఇవన్నీ ప్రసంగ వ్యాసాలు కాబట్టి కాల పరిమితిని దృష్టిలో పెట్టుకొని స్పష్టత, కుప్తతలకే ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుంది. అందుకే వివరంగా విశ్లేషించడానికి బదులుగా ఈ వ్యాసాలు పరిచయానికి పరిమితమైపోయాయి. శ్రోతల దృష్ట్యా చూస్తే కూడా అది సమంజసమే కావచ్చు. "తెలుగునాట హేతువాద ధోరణులు" 'కవుల కల్పనలో వేణువు' లాంటి విస్తృత ప్రాతిపదిక కలిగిన వ్యాసాల పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరముంది. కొత్తతరం పాఠకులకు సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించడంలో ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

❋ కె.పి.అశోక్ కుమార్

వేసవి సెలవుల సందర్భంగా...
రూ.420/- ల ఇంగ్లీష్ కోర్స్ పూర్తిగా ఉచితం!*

కోర్స్‌తో పాటు 8 ఫెంటాస్టిక్ గిఫ్ట్‌కోర్స్‌లు, 12 భాషల కోర్స్‌లు మరియు కోర్స్‌కు ఉపయోగపడే 5 గిఫ్ట్ పుస్తకాలు కూడా ఉచితం!

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	బేసిక్ ఇంగ్లీష్ కోర్స్	రూ.110/-
డివిజన్-2	గ్రామర్ ఇంగ్లీష్ కోర్స్	రూ.140/-
డివిజన్-3	స్పీకింగ్ & రైటింగ్ ఇంగ్లీష్ కోర్స్	రూ.170/-

Free 12 రోజుల్లో 12 భాషలు Free
(12 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. హిందీ స్పీకింగ్ కోర్స్ 2. తమిళ్ స్పీకింగ్ కోర్స్ 3. కన్నడ స్పీకింగ్ కోర్స్ 4. మలయాళం స్పీకింగ్ కోర్స్ 5. బెంగాలీ స్పీకింగ్ కోర్స్ 6. మరాఠీ స్పీకింగ్ కోర్స్ 7. పంజాబీ స్పీకింగ్ కోర్స్ 8. గుజరాతీ స్పీకింగ్ కోర్స్ 9. అరబిక్ స్పీకింగ్ కోర్స్ 10. ఉర్దూ స్పీకింగ్ కోర్స్ 11. ఒరియా స్పీకింగ్ కోర్స్ 12. సాన్‌స్క్రిట్ స్పీకింగ్ కోర్స్.

8 ఫెంటాస్టిక్ గిఫ్ట్ కోర్స్‌లు ఫ్రీ
(8 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. ఈజీ మనీ ఎర్నింగ్ కోర్స్ (సులభంగా డబ్బు సంపాదన)
2. సీక్రెట్ మ్యాజిక్ కోర్స్ (మీరూ మ్యాజిక్ చేయవచ్చు)
3. జెంట్స్ స్మార్ట్‌నెస్ కోర్స్ (మగవాళ్ళ ఆకర్షణని పెంచే కోర్స్)
4. బ్యూటీ ట్రీట్‌మెంట్ కోర్స్ (అందంగా కనిపించడం ఎలా?)
5. సక్సెస్‌ఫుల్ ఎగ్జామినేషన్ కోర్స్ (పరీక్షలకు తయారు చేసే కోర్స్)
6. యోగా కోర్స్ (వివిధ యోగాసనాల వివరణ)
7. పా 'మిస్టరీ' కోర్స్ (మీ చేతిరేఖలు చెప్పే భవిష్యత్తు)
8. కిచెన్ ట్రీట్‌మెంట్ కోర్స్ (వంటింట్లో స్త్రీల వైద్యం)

5 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు
(5 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. ఇంగ్లీష్ డిక్షనరీ (ఆంగ్లపదం - తెలుగుఉచ్ఛారణ - తెలుగు అర్థం)
2. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
3. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
4. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
5. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

ఈ కోర్స్ ఫ్రీగా పొందటం ఎలా?

1. ఇది ప్రచార పథకంలో భాగంగా ఫ్రీ గా ఇస్తున్న కోర్స్. ఈ కోర్స్ 5,000 మందికి మాత్రమే ఫ్రీ!... కాబట్టి, ముఖ్యమైన విషయం - మీరు కూపన్‌ని వెంటనే పంపాలి. 2. మీ పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి. ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌నే పంపాలి. జిరాక్సులు అంగీకరించబడవు. 3. దీని తర్వాత రాబోయే కొత్త కోర్స్‌లు కూడా మీకు పంపిస్తాము. ఇవి మీకు తప్పక ఉపయోగపడతాయనేది మా నమ్మకం. 4. ఒక్కొక్కరు ఒక కూపన్ మాత్రమే పంపాలి. 5. కూపన్‌లోని నిబంధనలు వర్తిస్తాయి. 6. ఈ స్కీమ్‌లో యాజమాన్య నిర్ణయమే ఫైనల్.

ఈ కూపన్ పూరించి వెంటనే పొందండి.

STUDENTS' ENGLISH INSTITUTE 2472
New No.203,Ground Floor, Habibullah Road, T.Nagar, Chennai -17.
నాకు ప్రస్తుతం రూ.420/- లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్స్ మరియు (12+8+5) ఉచిత పాకెట్ సైజు పుస్తకాలు ఇవన్నీ కలిపి కేవలం *పోస్ట్, ప్యాకింగ్ మరియు అడ్వర్టైజింగ్ ఖర్చులు నిమిత్తం రూ.100/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి సైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.
(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్స్‌ను పంపుటకు వీలుపడదు)
Name: ....
Address: ....
.... Pin Code

పట్టుదల. ఆమె మనస్సులో ఒక విషయం నాటుకుంది. 'జీవితం ఒక రణరంగం. ఘర్షణే ప్రతిక్షణం. చీకటి చుట్టుముట్టినా... చింతలు రేగినా... ఆశయ సాధన కోసం పట్టువదలకూడదన్నదే' ఆమె లక్ష్యం. ఆమె ఆశయం ఆకలి తీర్చుకోవడం. అందుకే దానితో నిరంతరం 'పోరు' సలుపుతోంది.

ప్రజాస్వామ్య దేశంలో ఏమిటిది? పాలు లేక పసిపాప తొట్టిలో ఏడుస్తుంటే... పాలివ్వలేని ఆ తల్లి కూడు లేక కుములుతుంటే.... ఎందుకిలా జరుగుతోంది. తమ బతుకులు ఇలా 'ఆకలి'తో ఎండగాలాల్సిందేనా? అనుకుంటోంది. గత వారం రోజులుగా ఆమెకు ఛాతిలో నొప్పి ఎక్కువైంది. దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. డాక్టర్ చెప్పిన మాటలు ఆమె మదిలో మెదులుతూనే ఉన్నాయి. "నీలో రక్తం పూర్తిగా తగ్గిపోయింది. పౌష్టికాహారం తీసుకోవాలి. నీ బిడ్డకు పాలివ్వడం వలన నీ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోంది. ఇక నుండి బిడ్డకు పాలివ్వద్దు. ఇది ఇలాగే కొన్ని రోజులు కొనసాగితే నీ ప్రాణానికే ముప్పు" అని చెప్పాడు. అనంతరం మందులు రాసిచ్చాడు. మందుల కోసం దుకాణానికి వెళితే బిల్లు వందల్లో అయింది. అందుకే ఆమె మందులు తీసుకోకుండా విరమించుకుంది.

ఇప్పుడు బిడ్డ పాల కోసం వెక్కివెక్కి ఏడుస్తోంది. ఆమెకు తిండి లేకపోవడంతో క్షీరగ్రంథులు పాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోయాయి. ఇప్పుడు



ఇద్దరు పిల్లలతో మృతుని భార్య లక్ష్మి

ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. పాపతో పాటు తాను కూడా ఏడ్వడం మొదలు పెట్టింది. అంతలోనే పక్కింటి వాళ్లు పిలిచారు. నీ భర్త హైదరాబాదు నుండి ఫోను చేశాడని. ఒక్కసారిగా ఏడుపు ఆపేసింది. ఆనందంతో పరుగులు తీస్తూ ఫోను దగ్గరకు వెళ్లింది. వారు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఆదివారం ఇంటికొస్తున్నట్లు చెప్పాడు. ఆ రోజు భర్త రాక కోసం ఎదురుచూస్తూ కూర్చొంది. తన పిల్లలకు కూడా నాన్న రాక విషయాన్ని తియ్యగా చెబుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు అతని రాక కోసం ఎదురుచూసింది. కాని రాలేదు. నిరాశతో నిద్రకు ఉపక్రమించింది.

సోమవారం ఉదయం మసకమబ్బులు తొలుగుతున్నాయి. పల్లెలో జనం ఇళ్ల నుండి బయటకు వస్తున్నారు. ఊరి బయట ఓ యువకుని శవం పడి ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రజలు గుంపులు గుంపులుగా అక్కడకు చేరుకుంటున్నారు. ఎవరో చూద్దామని బిడ్డల్ని చంకనెత్తుకుని లక్ష్మి బయలుదేరింది. గుంపును తోసుకుంటూ ముందుకెళ్లింది. ఒక్కసారిగా ఆమె కుప్ప కూలిపోయింది. అక్కడ మరణించింది ఎవరో కాదు తన భర్త మధు. భర్త శవంపై పడి రోదిస్తోంది. అతని జేబులో ఒక ఉత్తరం దొరికింది. "నా ఆత్మహత్యకు ఎవరూ కారకులు కాదు. పనుల కోసం హైదరాబాదుకు వెళ్లాను. అక్కడ కూడా పనులు దొరకలేదు. అందుకోసం ఇంటికి బయలుదేరాను. తెల్లవారితే అప్పుల వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలియలేదు. వట్టి చేతుల్తో ఇంటికి ఎలా వెళ్లాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని" రాసి ఉంది.

కుటుంబ బాధ్యతల నుండి అతడు శాశ్వతంగా విముక్తి పొందాడు. ఇప్పుడు ఆ బాధ్యతలను లక్ష్మి మోస్తోంది. తన కోసం మాత్రం కాదు. తన పిల్లల బతుకు కోసం. అందుకోసమే 'ఆమె' జీవిత రణరంగంలో 'సంఘర్షణ' పడుతోంది. ఇలా ఎంతకాలం అనేదే 'ఆమె' ప్రశ్న. ◆

'క్షమించవూ!...'

(19వ పేజీ తరువాయి)

ప్రవర్తిస్తోంది.. అన్యాయంగా వాడి జీవితం నాశనం చేశాం మనం.."

ఆనందరావుక్కూడా అర్థం కాలేదు... అతనికి సరోజ ప్రవర్తన కొంచెం అసాధారణంగా కనిపించింది.. అదేమిటో తెలుసుకోవాలని ఒకరోజు కొంచెం కోపంగా అన్నాడు... "అమ్మాయ్... నీ ప్రవర్తన నాకు నచ్చలేదు.... అన్యాయంగా నా కొడుకు గొంతుకోశాననిపిస్తోంది... నువ్వు నీ ప్రవర్తన మార్చుకోకపోతే ఫలితం బాగుండదు...." అని వార్నింగ్ ఇచ్చాడు...

అది అవకాశంగా తీసుకున్న సరోజ "చాలా సంతోషం. నాక్కూడా మీ అబ్బాయి ప్రవర్తన నచ్చలేదు... నాకు స్వేచ్ఛనివ్వడం లేదు... భార్యంటే బానిస అనుకునే స్థితి నుంచి మీ అబ్బాయి ఎదగలేదు.. నాకు ఈ ఇంట్లో స్వాతంత్ర్యం లేదు.. నాఇష్టం వచ్చినట్టు బతకనివ్వకపోతే నేను ఇక్కడుండను... ఇవాళే మా పుట్టింటికివెళ్ళిపోతాను" అని చెప్పి విసురుగా పెట్టె తీసుకుని వెళ్ళిపోయింది. శ్రీకాంత్ అనుకోని సంఘటనతో బిత్తరపోయాడు.. సరోజ పుట్టింటికి వెళ్ళడంతో అతనికి భయం పట్టుకుంది.... తమ గొడవ సంగతి వాళ్ళవాళ్ళకి చెప్తుందేమో... ఆ తరువాత వాళ్లేమంటారో... విడాకులు ఇస్తుందో ఇవ్వదో అనే భయాలతో అతను పిచ్చివాడైనాడు... చరిత కూడా బాగా ఒత్తిడి చేయసాగింది...

ఆనందరావు, ప్రసాదరావుకి చాలా ఆవేశంగా ఉత్తరం రాయాలనుకున్నాడు... కానీ, దానివలన తమ స్నేహం పాడవుతుందని అనుకుని ఆ ప్రయత్నం విరమించుకుని వెంటనే భార్యను తీసుకుని తాను కూడా హైదరాబాద్ వెళ్ళిపోయాడు.. ప్రసాద్‌తో పర్సనల్‌గా మాట్లాడటానికి...

సరోజ హఠాత్తుగా పుట్టింటికి రావడం, అదీ ఒక్కతే రావడం ఆ ఇంట్లో వాళ్ళకి అర్థం కాలేదు... కానీ, ఆమె మామూలుగా నవ్వుతూ తిరగడంతో పుట్టింటి మీద బెంగతో వచ్చి ఉంటుందిలే అని సర్ది చెప్పుకున్నారు.

చరితను శ్రీకాంత్ ఇంటికి తీసుకొచ్చాడు...

కానీ, ఎందుకనో అతనికి సరోజ ఉంటే కలిగిన హాయిలాంటిది చరిత ఉంటే కలగలేదు... శారీరకంగా ఆమెతో స్వర్గసుఖాలు అనుభవిస్తున్నా, మానసికంగా ఏదో అశాంతిగా ఉండసాగింది.

అనుకోకుండా ఓ రోజు చరితకి స్టేట్స్‌కి వెళ్ళే అవకాశం వచ్చింది.

శ్రీకాంత్ అందుకు అంగీకరించలేదు....

చరిత పట్టుబట్టింది... "ఎంతో కాలంగా ఎదురు చూసిన అవకాశం వస్తే ఎలా వదులుకోను", అని దెబ్బలాడింది... "నువ్వు అమెరికాలో, నేనిక్కడ మనదేం కాపురం? భార్యభర్తలిలా ఉంటారా?" అన్నాడు శ్రీకాంత్.

"మనం భార్యాభర్తలం కాదు... ప్రేయసీ ప్రియులం... నాకు నీకన్నా నా కెరియర్ ముఖ్యం... దయ చేసి నా అభివృద్ధికి అడ్డుపడకు" అని నిక్కచ్చిగా చెప్పింది చరిత.

సరోజకువచ్చి నెల రోజులైనా భర్త దగ్గరకు వెళ్ళకపోవడంతో తల్లికి అనుమానం వచ్చింది... కోడలు పద్మతో విషయం కనుక్కోమని చెప్పింది.

పద్మ ఓ రోజు సరోజ దగ్గరగా వెళ్ళి "శ్రీకాంత్‌కి ఉత్తరం రాయకపోయావా సరోజా... వచ్చి తీసుకెళ్లమని" అన్నది.

"ఏం వదినా... నేను మీకు భారంగా ఉన్నానా?" అడిగింది సరోజ.

పద్మ ఆ సమాధానానికి బిత్తర పోయింది.

"అది కాదు... నువ్వొచ్చి నెలదాటింది. ఇంకావెళ్ళకపోతే అతనక్కడ ఒంటరిగా ఎలా ఉంటాడు?" అన్నది పద్మ...

"అతను ఒంటరికాదులే వదినా... ప్రేమించిన యువతి అతని దగ్గరే ఉంది.." అంది సరోజ ఏడుస్తూ..

ఆ మాటలు విన్న తల్లి, వదిన నిశ్చేష్టులయ్యారు... ఆ క్షణమే ఈ వార్త ప్రసాద్‌కీ, ఆనందరావుకీ చేరిపోయింది...

కోడలు ప్రవర్తనకు అర్థం తెలిసిన ఆనందరావు, ప్రసాద్‌తో అన్నాడు... "కంగారు పడకు ప్రసాద్... నాకు అంతా తెలుసు... ఒక్క రోజు ఆగు... శ్రీకాంత్ వచ్చి భార్యను తీసుకెళ్తాడు..." అని ఓదార్చాడు...

ఆయన అన్నట్టుగానే చరిత చేసిన మోసంతో, ఆమె నిర్లక్ష్యంతో శ్రీకాంత్ గుండె గాయపడింది. అతనికి సరోజ గుర్తొచ్చి, తను చేసిన పాపానికి తగిన ప్రాయశ్చిత్తం జరిగిందని కుమిలిపోసాగాడు... సరోజ దగ్గరకు వెళ్ళాలంటే మొహం చెల్లలేదు.

సరోజలాంటి ఉత్తమురాల్ని వదులుకున్నందుకు తనను తనే చిత్రవధ చేసుకోసాగాడు...

ఆ రోజు అతనికి ఏం చేయడానికి మనస్కరించలేదు... ఎట్టి పరిస్థితుల్లోనూ సరోజ దగ్గరికి వెళ్ళి కాళ్ళమీద పడి క్షమాపణ వేడుకోవాలనిపించింది...

వెంటనే ఫ్లైటుకి బయల్దేరాడు...

నేరుగా అత్తగారింటికి వెళ్ళాడు.. సరోజ హాల్లోనే ఎదురైంది.

".... విడాకుల కాగితాలు తెచ్చారా? సంతకం చేస్తాను" అంది కఠినంగా.

శ్రీకాంత్ తలదించుకున్నాడు సిగ్గుతో. ◆

హిమలేహ్యం...!



✻ కొండబాబు

ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో ఆరోస్థానం మన తెలుగుదే.

* * *

తెలుగు పదాలు హల్లుతో కాకుండా అచ్చుతో అంతమవుతాయి. అందుకే అది అజాంతం. గుండ్రని లిపి దాని సొంతం.

* * *

తీయనైనది. తేటయయినది. ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అని కొనియాడబడినది మన భాష.

* * *

నన్నయ్య కాలానికి ముందు మన భాషకు ముప్పయ్యారే అక్షరాలు. మరో పందొమ్మిదిని చేర్చి ఆదికవి సమగ్రమైన భాషను చేర్చారు.

* * *

తెలుగు వారుగా మనం గర్వపడదాం. తెలుగు వారందరం తెలుగే మాట్లాడదాం.

* * *

గత నెలలో మాతృభాషా దినోత్సవం నాడు తెలుగు భాషా పరిరక్షణ సమితి సభ జరిగింది. అనంతరం అధికార భాషా సంఘం అధ్యక్షులుగా కొత్త వారు వచ్చారు. ఈ నేపథ్యంలోనే మొన్నటి ఉగాదిని జరుపుకున్నాం. ఆ ఉగాది నాడు తెలుగు టీవీ ఛానల్ ఒకటి నినాదాలను ప్రజల ముందుంచింది. అధికార భాషా సంఘం నూతనాధ్యక్షుడితో ఇంటర్వ్యూనే కాక, తెలుగు నటీనటులతో ఈ నినాదాలను ప్రసారం చేసింది.

'మాతృభాష కళ్ళ వంటిది. ఆంగ్లం కళ్ళజోడు వంటిది' అని ద్రవిడ ఉద్యమ నేత ఒకరు చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హం. మన చూపుకు అందని వాటి విషయంలో ఎలా కళ్ళజోడు వాడతామో మన భాషకు అందని భావం చెప్పాలనుకున్నప్పుడే ఆంగ్లాన్ని ఉపయోగించాలని, మాతృభాష లేనప్పుడు కళ్ళు లేని కబోది పెట్టుకునే నల్లద్దాలుగానే కళ్ళజోడు మిగిలిపోతుందని, ఆంగ్లమయినా అంతేనని ఆయన మాటల సారాంశం.

మన భాషకు అన్ని భావాలు అందుతాయా? అంత పదసంపద మనకుందా? అనే ప్రశ్నను కొందరు సంధిస్తారు. ఇది కచ్చితంగా చర్చించుకోవలసిన విషయం.

వాస్తవంగా మనకున్న పదసంపద తక్కువేమీ కాదు. ఏర్పడిన నాటి నుంచి తెలుగు ఆదానప్రదానాలతో పరిపుష్టమవుతూనే వస్తున్నది. అత్యధిక శబ్దాలకు అక్షరాలున్నాయి. అనేక భావాలకు పదాలున్నాయి. జనజీవన, సాంస్కృతిక నేపథ్యం వచ్చిన క్రియా సంపద ఉంది. అయితే కొందరు విమర్శకులు ఇందులో వాస్తవ తెలుగు ఎంత ? అనడుగుతారు.

చారిత్రక పరిణామాలు మిగతా విషయాల్లో లాగానే భాషనూ ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఆదానప్రదానాలుగా ఇతర దేశీయ భాషల నుంచి వచ్చి చేరినదంతా మనదే. ద్రావిడ, సంస్కృత, ఉర్దూ భాషల నుంచి అనేకం వచ్చి చేరాయి. అజాంతంలోకి మారాయి. అది తప్పు కాదు. అవసరాలు తీర్చుకొనడం. ఉర్దూ బందోబస్తు, కిస్తీ, తాసీలు తెలుగుగా మారాయి. తమిళ దోశ, సాంబారు తెలుగువయ్యాయి. సంస్కృత అన్నం తెలుగువారి బువ్వకు పర్యాయమై... ప్రధానమయింది. ఇదేమీ దోషం కాదు. ఇదంతా చరిత్ర. అది నేర్పిన నడక.

ఇప్పటికీ అదే నడక... లేదా అంతకన్నా మంచి నడకతో ముందుకు సాగడం అవశ్యమే. సమాచారపరంగా ప్రపంచ దగ్గరయింది. కొత్త విషయాలు, భావాలు, రుచులు, అభిరుచులు, వస్తువులు, పనులు, సంబంధ బాంధవ్యాలు తెలుస్తున్నాయి. క్రమంగా వస్తూ ఉన్నాయి.

వీటిలో భావాలకు, విషయాలకు, రుచులకు, అభిరుచులకు మన భాషా సంపదే సరిపోవచ్చు. కొత్త వస్తువులు, కొత్త పనులకే మనం పదాలను వెతుక్కోవలసి రావచ్చు. ఆ అవసరం తీరడానికి మనకే బోలెడు పనిముట్లున్నాయి. మన ప్రాచీన, విశ్వనాథ వంటివారి సంప్రదాయ సాహిత్యం, ఎక్కువ మందికి తెలిసిన గురజాడ, కందుకూరి, శ్రీపాద, శ్రీశ్రీ, కో.కు వంటి వారి ఆధునిక సాహిత్యంలోంచే ఈ ఖాళీలను భర్తీ చేసుకోవచ్చు. ప్రజల వాడుకలో వున్న, సరిపోయిన మాండలికాలను ప్రామాణీకరించవచ్చు. అప్పటికీ చాలనప్పుడు తెలుగునాట ఎక్కువ కలిసిపోయిన ఉర్దూ పదసంపద నుంచి తెలుగు చేసుకోవచ్చు. సరిహద్దుల్లో పలికే ఇతర ద్రవిడ భాషా పదాలను తెచ్చుకోవచ్చు. అప్పటికీ చాలనప్పుడు హిందీ, హిందూస్థానీ, భాషల నుంచీ సరిపోయేవి తెచ్చుకోవడమూ తప్పేం కాదు. కొన్నిసార్లు ఆంగ్ల, ఇతర భాషా పదాలను యథావిధిగానూ వాడేసుకోవచ్చు. కంప్యూటరు, టైపురైటరులాగ.

ప్రతి ఇతర భాషా పదాన్నీ తెలుగు చేసుకోవాలనే చాదస్తమూ పనికిరాదు. ఈ విధంగా ఐస్‌క్రీమును హిమలేహ్యంగా మార్చడం లాంటి హాస్యాస్పద ఆచరణా సరికాదు. ఈ జాగ్రత్తలతోనే అమ్మ భాషను అమలు చేసుకుందాం.

ఇందుకు భాషావేత్తలే కాదు, పాత్రికేయులు, తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం, అందరకూ మించి ప్రభుత్వం చేయాల్సిన కృషి ఎక్కువగా ఉంది. ◆

పాఠక స్పందన

కట్నమడిగితే కఠిన శిక్ష

ఏప్రిల్ 6 సంచికలో అదాలత్ కథలు శీర్షికన ప్రచురించిన వ్యాసం చాలా వివరంగా ఉంది. కట్నం వేధింపులు ఎంత తీవ్రంగా ఉంటున్నాయో ఈ వ్యాసంలో విపులంగా తెలియజేశారు. ఇలా వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

– మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

కథ నచ్చలేదు

మార్చి 30వ తేదీ సంచికలో ప్రచురించిన కరివేపాకు మామ్మ కథ ఏమి బాగుండలేదు. ఉద్యోగాలు చేసే మహిళలు స్టేటస్ కోసమే చేస్తున్నారని రచయిత అభిప్రాయం లాగా ఉంది.

–Haritha Devi<b_devi2003@yahoo.com

హృదయాన్ని కదిలించిన ఉన్మాదం

మార్చి 16 సంచికలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'మానవత్వాన్ని మంటగలిపిన ఉన్మాదం' వ్యాసం మా హృదయాలను కలచి వేసింది. ఈ వ్యాసం మతాచారాలకు మహిళలు ఏ విధంగా ఇబ్బందుల పాలవుతున్నారో చక్కగా వివరించారు.

– విజయ, విమల, ప్రమీల, సిద్దారెడ్డిపల్లె, కడప

'కనవిప్పు' కలిగించిన కథ

మార్చి 30వ తేదీ సంచికలో ప్రచురించిన 'కరివేపాకు మామ్మ' కథ చాలా బాగుంది. కరివేపాకు అమ్మే మామ్మ తనకు కొడుకు, కోడలూ వుండి కూడా తను ఇంకా కష్టపడుతున్న తీరు చాలా మందికి కనువిప్పు కాగలదు.

– హరి రాధాకృష్ణ, అల్లూరు, కృష్ణాజిల్లా